

డ్రైనేజీ ముంపు..
సాగుకు దూరం
● వ్యవసాయ భూమి ఉన్నా పండించలేక పేద కుటుంబ దైన్యం
● అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం
5



కాన్గల్‌లోని బర్డ్‌ఫ్లూ సోకిన లేయర్ ఫామ్

1,23,185

కోళ్లను చంపేసిన పశుసంవర్ధకశాఖ అధికారులు

● బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో చర్యలు
● ఒక్కో బ్యాగులో 25 కోళ్లు పెట్టి పూడ్చివేత
● 14 వేలకు పైగా కోడిగుడ్లు, 800 టన్నుల దాణా కూడా..
● కాన్గల్‌లో వైద్యశాఖ జ్వర సర్వే

సిద్దిపేటటౌన్/తొగుట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జిల్లాలోని తొగుట మండలం కాన్గల్ పరిధిలోని ఓ లేయర్ ఫాంలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై ఆ ఫామ్‌తో పాటు కిలోమీటరు పరిధిలో ఉన్న మిగతా ఫామ్‌లోకి కోళ్లను చంపి వేయాలని అధికారులు నిర్ణయించారు. పీపీఈ కిట్ల సహాయంతో పశు సంవర్ధక శాఖ అధికారులు 20 టీమ్‌లుగా ఏర్పడి ఫామ్‌లోని 1,23,185 కోళ్లను ఈ నెల 9 నుంచి 12 వరకు చంపేశారు. ఫామ్‌లోని కోళ్ల తలలను విరిచి ఒక్కో బ్యాగులో దాదాపు 25 కోళ్లను మూట కట్టి గ్రామ శివారు పరిధిలో పెద్ద గొయ్యి తీసి పూడ్చివేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కోళ్లను చంపగా, ఆ చంపిన కోళ్లను మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు పూడ్చిపెట్టారు. ఆదివారం ఫామ్‌లోని 14898వేలకు పైగా కోడిగుడ్లు, 800 టన్నుల దాణా సైతం పూడ్చి పెట్టారు.

పోలీసు పహారాలో..

బర్డ్‌ఫ్లూ వైరస్ ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో ఆ ప్రాంతమంతా పోలీసుల సహాయంతో బారికేడ్లు ఏర్పాటు చేసి అటువైపు ఎవరూ వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, ఫామ్‌లో పనిచేస్తున్న దాదాపు 10 కుటుంబాలకు చెం దిన వారిని మాత్రమే అనుమతించి కోళ్లను చంపివేసే కార్యాక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. దాదాపు ఐదు రోజుల నుంచి అటు పశుసంవర్థశాఖ అధికారులు, ఇటు పోలీసులు శ్రమించి ఎట్టకేలకు బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లను చంపివేశారు. తొలుత కిలోమీటరు పరిధిలోని ఫామ్‌లోని కోళ్లను చంపివేయాలని అధికారులు నిర్ణయించినప్పటికీ అక్కడ ఎలాంటి బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించకపోవడంతో వాటిని చంపకుండా వదిలేయాలని నిర్ణయించారు. బర్డ్‌ఫ్లూ ఉన్న ఫామ్‌లో మరో నెలల పాటు కోళ్లను వేయకూడదని అధికారులు ఫామ్ యజమానికి, లీజుదారులకు సూచించారు. 3 నెలల తరువాత వేస్తే గనుక, మళ్లీ పరీక్షలు నిర్వహించాలని సూచించినట్లు అధికారులు వెల్లడించారు.



తొగుట మండల కేంద్రంలో జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు

రెండు నెలల క్రితం రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వచ్చిందన్న విషయం దావనంలా వ్యాపించడంతో చికెన్ అమ్మకాలు తగ్గిపోయాయి. అప్పటివరకు బాగానే సాగిన అమ్మకాలు, బర్డ్‌ఫ్లూ భయంతో ధరలు అమాంతంగా రూ. 150 వరకు పడిపోయాయి. ఈ మేరకు చికెన్‌ను 70 డిగ్రీల ఉష్ణోగ్రతలో వండితే ఫ్లూ వైరస్ చనిపోతుందని పౌల్ట్రీ సంఘాలు ప్రజల్లో అవగాహన కలిగించాయి. మెల్లమెల్లగా జిల్లాలో చికెన్ అమ్మకాలు పెరుగుతున్న తరుణం లో మళ్లీ తొగుట మండలంలోని కాన్గల్‌లో బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో ఒక్కసారిగా చికెన్, గుడ్లు తినేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడం, అధికారులే స్వయంగా ప్రకటించడంతో సిద్దిపేటలో ఆ ప్రభావం తీవ్రంగా చూపుతోందని చికెన్ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే మరో రెండు మూడు నెలల పాటు కొనసాగితే వ్యాపారాలు నిర్వహించలేక ఆర్థిక సమస్యలు ఏర్పడి, ఇబ్బందులు పడుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే చేపట్టిన వైద్యశాఖ

బర్డ్‌ఫ్లూ సోకిన నేపథ్యంలో గ్రామ ప్రజలకు ఏమైనా ఫ్లూ లక్షణాలు ఉన్నాయా? అని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యశాఖ సిబ్బంది జ్వర సర్వే చేపట్టారు. కోళ్లకు సంబంధించి ఫామ్ పరిధిలో అయితే కిలోమీటరు మేరకు, ప్రజలకైతే 10 కిలోమీటర్ల మేరకు సర్వే చేయనున్నారు. ఇప్పటివరకు కాన్గల్ గ్రామంతో పాటు మూడు కిలో మీటర్ల పరిధిలోని పరిసర గ్రామమైన తుక్కాపూర్‌లోని 2818 మందికి గానూ 2818 మందికి జర్వ సర్వే చేయగా ఎలాంటి లక్షణాలు కనిపించలేదు. దీంతో తొగుట మండల కేంద్రంలోని 2632 మందికి గానూ ఆదివారం 794 మందికి జ్వర సర్వే నిర్వహించగా ఎలాంటి ఫ్లూ లక్షణాలు కనిపించలేదు.



గ్రామంలో పోలీసుల పహారా

భానుడి ప్రతాపం

● ముదిరిన ఎండలు.. ప్రజలు విలవిల ● జిల్లాలో ఐదు మండలాల్లో 41 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
● అక్కన్నపేట మండలం కట్కూర్‌లో అత్యధికంగా 41.4 డిగ్రీలు

కోహీర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) గత రెండు రోజుల నుంచి భానుడి ప్రతాపానికి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఎండవేడికి విలవిలలాడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయా మండలాలలో ఎండల తీవ్రత అధికమవడం వల్ల ప్రజలు ఎండవేడికి ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేట్, చేర్యాల, బెజ్జంకి కుకునూరు పల్లి, సిద్దిపేట అర్బన్ మండలాలలో ఏకంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. రెండు రోజుల నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండల తీవ్రత అధికమవడంతో రైతులు కూలీలు వ్యవసాయ పనులు చేసేందుకు పొలాలకు వెళ్లేవారు ఇబ్బందులు పొడ్డారు. ఎండలు మళ్లీ ముదరడంతో ప్రజలకు ఇబ్బందులకు తప్పడం లేదు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత మొదలై సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపం చూపించాడు. ఇదిలా ఉండగా మరో రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ సమాచారం మేరకు ఎండల నుంచి కాస్త ఉపశమనం లభించవచ్చని ప్రజలు భావిస్తున్నారు.



ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

సిద్దిపేట జిల్లా : కట్కూరు 41.4, చిట్యాల 41.3, బెజ్జంకి 41.3, లద్దారం 41.2, సిద్దిపేట 41.2, రేబర్తి 41.0, హబ్సిపూర్ 40.9, రాఘవపూర్ 40.9, పోతిరెడ్డిపేట్ 40.9, శనిగారం 40.7, సముద్రాల 40.6, కోహెడ 40.4, అంగడికిషాపూర్ 40.4, పెద్దకోడూరు 40.4, చాట్లపల్లి 40.2, ముస్త్యాల 40.1, గజ్వేల్ 40.0, హుస్నాబాద్ 39.8, తుక్కాపూర్ 39.7, దుబ్బాక 39.6, గండిపల్లి 39.5, చికోడు 39.3, నంగునూరు 39.3, కొండ్లకండ్ల 39.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లా : నాగపూర్ 40.9, మాసాయిపేట 40.8, వెల్దుర్తి 40.6, దామరంచ 40.5, పాతూర్ 40.4, వాడి 40.3 నర్లాపూర్ 40.1, చిట్కాలు 40.0, శివంపేట 40.0, బోడాఘాట్ 39.9 లింగాయపల్లి 39.9, రాజ్‌పల్లి 39.7, కొత్తపేట్ 39.7, కౌడిపల్లి 39.6 లక్ష్మాపూర్ 39.6, సర్ధన 39.6, కుల్చారం 39.5, పెద్ద శంకరంపేట 39.5, శివనూరు 39.3, బుజరంపేట 39.2, రామాయంపేట 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లా: కడ్పల్ 39.9, పల్వట్ల 39.8, మనూర్ 39.8, దిగ్వాల్ 39.8 నిజాంపేట్ 39.7, అన్నసాగర్ 39.7 మల్‌చెల్మా 39.6 జిన్నారం 39.6, ఫుల్కల్ 39.4, ముక్తాపూర్ 39.0, సుల్తాన్‌పూర్‌లో 38.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

లెక్క తేల్చారు

● కొమురవెల్లి మల్లన్న ఆలయ వార్షిక ఆదాయ, వ్యయ వివరాల వెల్లడి
● రూ.45.81కోట్లకు చేరిన టర్నోవర్
● రూ.20.97 కోట్ల నికర ఆదాయం
● గతేడాదికన్నా రూ.2.23కోట్ల ఆదాయం మెరుగు
● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ 2024-25 ఆర్థిక సంవత్సర వార్షిక ఆదాయ, వ్యయాల వివరాలను ఎట్టకేలకు ఆలయాధికారులు వెల్లడించారు. ఆర్థికసంవత్సరం ముగిసి మూడువారాలు గడిచినా ఆలయ ఆదాయ, వ్యయ వివరాలను వెల్లడించని విషయమై శనివారం ఆంధ్రజ్యోతిలో 'లెక్క తేల్చడం లేదు!' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆలయాధికారులు స్పందించారు. ఈ విషయమై ఆలయ ఈవో అన్నపూర్ణ ఆదివారం ఆదా య, వ్యయ వివరాలు వెల్లడించారు. ఏడాదికాలంగా టికెట్లు/సేవలద్వారా రూ.8,39,86,546 ప్రసాద విక్రయాలు ద్వారా రూ.6,31,03,225, హుండీ లెక్కింపుల ద్వారా రూ.7,59,69,626, పెట్టుబడుల ద్వారా రూ.12,51,01,073, వడ్డీరూపంలో రూ.92,25,012, లీజ్ అండ్ లైసెన్సుల ద్వారా రూ.2,88,02, 371, అన్నదానం ద్వారా రూ.25,72,729, ఇతర ఆదాయం ద్వారా రూ.81,78,760, అడ్జస్ట్‌మెంట్స్ ద్వారా రూ.53,30,954 చొప్పున రూ.40,22,70,296 మేర ఆదాయం సమకూరిందని తెలిపారు. ప్రారంభ నిల్వ ప్రకారం రూ.55,60,488, బ్యాంకు డిపాజిట్ రూ.5,03,46,312 ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యయాల కింద రిట్యుయల్స్/ఉభయం/ఉత్సవాల నిర్వహణకు రూ.95,78,147, ప్రసాద తయారీకి రూ.4,0864,536, ఎస్టాబ్లిష్‌మెంట్ చార్జీల రూ.5,72,46,208, స్టాటుటరీ చెల్లింపులు రూ.3,18,68,961, అడ్జస్ట్‌మెంట్స్ రూ.12,77,73,930, ఇతరాలు రూ.74,72,979, పెట్టుబడులు రూ.1.50 కోటి, అన్నదానం రూ.36,10,194, జాతర నిర్వహణ ఖర్చు రూ.94,89,002, నిర్మాణాలు రూ.5,69,55,947, వేతనాలు రూ.1,61,50,021, శానిటేషన్‌కు రూ.1,03,98,669 మేర వ్యయం చేసినట్లు తెలిపారు. ముగింపు విలువగా నగదు 15,10,221 బ్యాంకు డిపాజిట్లు రూ.7,02,58,281 ఉన్నట్లు పేర్కొన్నారు. మొత్తంగా రూ.45.81కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. నికర ఆదాయం రూ.20,97,93,956 సమకూరినట్లు వెల్లడించారు. 2023- 24 ఆర్థిక సంవత్సరం జాతరలో 12 వారాలు కొనసాగగా, రూ.46.34 కోట్ల టర్నోవర్, రూ.18.74 కోట్ల నికర ఆదాయం చేటుచేసుకుంది. 2024-25 లో 10 వారాల జాతర జరిగినప్పటికీ టర్నోవర్ తగ్గినా నికర ఆదాయం రూ.2.23కోట్లు పెరిగిందని చెప్పారు. గతేడాది కన్నా తక్కువగా భక్తులు వచ్చినా, అంతకు మించి వసతుల కల్పన మెరుగుపడనప్పటికీ అడ్జస్ట్‌మెంట్స్, జాతర ఖర్చులు, శానిటేషన్ ఖర్చులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మల్లన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పించి ఆలయాభివృద్ధికి పాటుపడతానన్నారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయించేందుకు ప్రత్యామ్నాయ చర్యలను వేగవంతం చేయించి అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న ఈవో అన్నపూర్ణ



కనపడే దేవుళ్లు డాక్టర్లు

● సురభి గ్రాడ్యుయేషన్‌డేలో మంత్రి పొన్నం, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో గొప్పగా రాణించి తల్లిదండ్రులకు, సమాజానికి గొప్ప పేరు తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే హరీశ్, యూనివర్సిటీ వీసీ నందా కుమార్ రెడ్డి కోరారు. ఆదివారం మిట్టపల్లి సమీపంలో సురభి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజ్ మొదటి గ్రాడ్యుయేషన్ వేడుకలకు వారు హాజరై మాట్లాడారు. చాలా కొద్దిమందికి మాత్రమే డాక్టర్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కనపడని దేవుడికి, అదే విధంగా కనపడే డాక్టర్‌కు మాత్రమే ప్రజలు మొక్కుతారని చెప్పారు. తెలంగాణ వచ్చాక చాలా మెడికల్ కాలేజీలు వచ్చాయన్నారు.
మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్యులు తయారవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సురభి మెడికల్ కాలేజీ ఛైర్మన్ హరిందరావు, మహేందర్ రావు,మనోహర్ రావు,డీన్ రఫీ,మెడికల్ డైరెక్టర్ రామ్ ప్రసాద్, పీఆర్ ఓ పరిశరములు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం



అకాల వర్షం
తడిసిన ధాన్యం

అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు కన్నారం, చాపగానితండా, పంతులుతండా గ్రామాలల్లో ఆదివారం రాళ్లతో కురిసిన అకాల వర్షం కురిసింది. ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. అకాల వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో అరపోసిన ధాన్యం పూర్తి గా తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

– అక్కన్నపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)





కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు

● రేవంత్ తప్పులతో అధికారులకు శిక్ష
● రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీ చేసిండు
● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

గజ్వేల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గాలిలో వచ్చింది.. గాలిలోనే పోయిందని.. ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయి ఉన్నారని మాజీ మంత్రి తన్నీర హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల నేపథ్యంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్, గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి గజ్వేల్ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పరిస్థితి అధ్వానంగా మారిందని, జాకీలు పెట్టి లేపినా లేచే పరిస్థితిలో లేదన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాత ప్రభుత్వ ఆస్తులు అమ్ముకోవడానికి, కుదవపెట్టడానికి వీలు లేకుండా పోయిందని, రేవంత్ పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. వ్యాపారాలు నడవడం లేదని వ్యాపారులు వాపోతున్నారని, బీఆర్ఎస్ పాలనలో ఇళ్లు, షాపులు కిరాయికి దొరికేవి కావన్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా టూ-లెట్ బోర్డులు కనపడుతున్నాయన్నారు. దేవుడిపై ఒట్టు పెట్టి దేవుళ్లనే మోసం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు. రుణ మాఫీ విషయంలోనూ రైతులను కాంగ్రెస్ మోసగించిందని, ఎవరికి రుణమాఫీ సరిగా జరుగలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో కరోనా కాలంలోనూ రైతుబంధు ఇచ్చామని కానీ, రూ.14వేల కోట్ల రైతు బంధు ఎగ్గొట్టి రుణ మాఫీ చేశారని మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టరా?

రైతులు చెట్లు నరికితే కేసులు పెట్టే సర్కారు 400 ఎకరాల్లో చెట్లు నరికిన రేవంత్‌రెడ్డిపై పెట్టరా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. గచ్చిబౌలి భూములు 400 ఎకరాలను కుదవపెట్టి ముఖ్యమంత్రి రూ.10 వేల కోట్లు అప్పులు తెచ్చారని, రూ.170 కోట్ల లంచం ఇచ్చి మరీ అప్పులు తెచ్చారని మండిపడ్డారు. ప్రశ్నిస్తే భూములు తనఖా పెట్టలేదని బుకాయిస్తున్నారన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం అప్లికేషన్ పెట్టానని, త్వరలోనే పూర్తి వివరాలు తెలుస్తాయని, రేవంత్‌రెడ్డి చేసిన తప్పులకు టీజీఐఐసీ ఎండీకి జైలు శిక్ష తప్పదన్నారు. నాటి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లిస్తే.. నేటి ప్రభుత్వం వారిని ఇబ్బందులు పెడుతోందని, 20శాతం కమీషన్ ఇచ్చిన వాళ్లకే బిల్లులు చెల్లిస్తున్నారని, ఇదే విషయమై కాంట్రాక్టర్లు సెక్రటేరియట్‌లో ధర్నా చేశారని దుయ్యబట్టారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

సన్నబియ్యంలో 40శాతం నూకలే...

సన్నబియ్యం పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. పేదలకు సన్నబియ్యం పేరుతో 40 శాతం నూకలే ఇస్తున్నారని ఆగ్రహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గురుకులాలకు ఏ విధంగా నూకలు లేని సన్నబియ్యం ఇచ్చామో, అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ స్వచ్ఛమైన సన్నబియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వరంగల్ సభకు తరలిరావాలి

ఈనెల 27 వరంగల్ సభను విజయవంతం చేయాలని, ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి లక్ష మంది తరలిరావాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చా రు. నాయకులు సమావేశానికి కార్లలో రాకుండా కార్యకర్తలతో బస్సుల్లోనే రావాలని, సభకు వచ్చిన కార్యకర్తలను ఇంటి వరకూ సురక్షితంగా చేర్చే బాధ్యత నాయకులదేనన్నారు. మహిళా కార్యకర్తలు, నాయకురాళ్లకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని అన్నారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ ఛైర్మన్లు రాజమౌళి, రవీందర్‌గౌడ్, కొట్టాల యాదగిరి, శేఖర్‌గౌడ్, బాల్‌రాజు, పాండుగౌడ్, పంగ మల్లేశం, ఊడెం కృష్ణారెడ్డి, దేవీ రవిందర్, శ్రీనివాస్, బెండే మధు, కరుణాకర్‌రెడ్డి, కనకయ్య, అరుణా భూపాల్‌రెడ్డి, బాలమణి, నూనె కుమార్, రమేశ్, అహ్మద్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా కృషి చేయాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సంఘం సభ్యులు కలిసికట్టుగా పనిచేసుకుని సంఘాన్ని అభివృద్ధి పరచడంతో పాటు రెడ్డి సంక్షేమం కోసం కృషి చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం రంగధాంపల్లి సమీపంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో జరిగిన రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సిద్దిపేటలో మొట్టమొదటి ఏసి రెడ్డి ఫంక్షన్ హాల్ నిర్మించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు వంగ తిరుమలరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజురెడ్డి, ప్రచార కమిటీ ఇన్‌చార్జి నాయన సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మాణిక్య రెడ్డి, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, ఎడ్ల వెంకటరామిరెడ్డి, నాయిని నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి ,సంపత్ రెడ్డి ,సోమిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పాశమైలారం పారిశ్రామికవాడలోని పరిశ్రమలో గాయపడిన కార్మికుడు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ అందించిన కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవేంద్ర(32) ఇస్నాపూర్‌లో నివాసమంటూ పాశమైలారం పారిశ్రామికవాడలోని కిర్బీ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 5వ తేదీన విధి నిర్వహణలో ఉండగా పెయింటింగ్ మిషన్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో దేవేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. పరిశ్రమ యజమాన్యం అపోలో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా పరిస్థితివిషమించడంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పరిశ్రమలో సేఫ్టీ లోపించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుని, దేవేంద్ర మృతికి కారణమైందని పలువురు కార్మికులు మండిపడుతున్నారు. ఈనెల 5వ తేదీన ప్రమాదం చోటు చేసుకుంటే విషయం బయటకి పొక్కనీయకుండా యజమాన్యం గుట్టుగా వ్యవహరించడంపై కూడా స్థానికులు మండిపడుతున్నారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, సేఫ్టీపై నిర్లక్ష్యం వహించిన పరిశ్రమ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.


దేవేంద్ర (ఫైల్)

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ప్రైవేట్ బస్సు

● 11 మందికి గాయాలు

కొండపాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న 11 మందికి గాయాలైన సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ పద్మానగర్‌కు చెందిన కొంతమంది ప్రైవేట్ బస్సులో హైదరాబాద్‌లోని వారి బంధువుల పెళ్లికి వెళ్లి శనివారం అర్ధరాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొండపాక మండలం దుద్దెడ శివారులోని టోల్గెట్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని బస్సు వెనుకవైపు నుంచి ఢీ కొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. బస్సులో ప్రయాణం చేస్తున్న రుద్ర లత, జొట్టు లక్ష్మీనారాయణ, ప్రణయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరితోపాటు జొట్టు ఓడేమ్మ, శ్రీలత, రుద్ర రాజకుమార్, అన్విత్, రాజవ్వ, మాధవి, జైదేవ్, సహస్రలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ అక్కడికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన రుద్ర లత, జొట్టు లక్ష్మీనారాయణ


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

కారు ఢీకొని యువకుడి మృతి


తేజేశ్వరరావు(ఫైల్)

జహీరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన జహీరాబాద్ పట్టణంలోని అల్గోల్ చౌరస్తా వద్ద శనివారం రాత్రి చోటు చేసుకున్నది. పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. తేజేశ్వరరావు(32) జహీరాబాద్ పట్టణంలో పనులను ముగించుకుని శనివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై జహీరాబాద్‌నుంచి అల్గోల్ శివారులోని లెజెండ్‌వెల్లిలో తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అల్గోల్ చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తేజేశ్వరరావు భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

పశుగ్రాసం, మోటార్ పైపులు దగ్ధం

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు వరి గడ్డి, మోటారు పైపులు దగ్ధమయ్యాయి. మీర్జాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల కళవ్వకు చెందిన వ్యవసాయ బావి వద్ద సాయంత్రం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు చెలరేగి ఎకరం పొలంలోని వరి గడ్డిపై పడడంతో దగ్ధమైంది. కరెంటు మోటారు వైర్లు, స్టాటర్, పైపులు కాలిబూడిదగా మారాయి. రూ.60 వేల నష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు.

సఫాయి కార్మికురాలికి ఆర్థిక సాయం

గుమ్మడిదల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదలకు చెందిన సఫాయి కార్మికురాలు రాజమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి కార్మికురాలు కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయనతోపాటు సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, నాయకులు కాలకంటి బాల్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


నీలం శేఖర్(ఫైల్)

శివ్వంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బంధువుల ఇంటికి వచ్చి చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం శివ్వంపేట మండల పరిధి కొత్తపేటలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెంకట్‌రావుపేట్ గ్రామానికి చెందిన నీలం శేఖర్(28) కొత్తపేట గ్రామంలో ఉండే బావ అంతరం జగన్ ఇంటికి వెళ్లాడు. కాగా, బావ జగన్‌తో కలిసి శనివారం రాత్రి స్థానిక రాయినికుంటలో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో జేసీబీ గుంతలో పడి మృతి చెందాడు. జగన్ గ్రామస్థులకు సమాచారం ఇవ్వగా కుంట దగ్గరకు చేరుకున్న వారు మృతదేహాన్ని వెలికి తీశారు. మృతిని తండ్రి వెంకటస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

బీబీపేట్‌లో మహిళ అదృశ్యం


కుమ్మరి సునీత(ఫైల్)

కల్హేర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బీబీపేట్ గ్రామానికి చెందిన వివాహిత మహిళ అదృశ్యం అయినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి సునీత(35) శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, ఇతర చోట్ల కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సునీత భర్త కుమ్మరి సాయిలు ఆదివారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సికింద్లాపూర్‌లో వివాహిత..

శివ్వంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ తగాదాలతో భర్త మందలించగా వివాహిత ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైన సంఘటన ఆదివారం సికింద్లాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర శ్యామల(45) భార్యాభర్తల మధ్య వివాదం నెలకొనడంతో శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఎర్ర సత్యయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

గుమ్మడిదల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జీవితం మీద విరక్తి చెంది యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం గుమ్మడిదలలో చోటుచేసుకున్నది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గుమ్మడిదలకు చెందిన బీర్ల నాగరాజు(30)కు కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన అనితతో 15 నెలల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు తరచూ గొడవ పడేవారు. ఈ మధ్య కాలంలోనే గొడవ పడి అనిత తన పుట్టింటికి వెళ్లింది. పెద్దమనుషులు మాట్లాడి అనితను తిరిగి అత్తారింటికి తీసుకువచ్చారు. బంగారు నగలు లేకుండా రావడం గమనించిన నాగరాజు అమ్మ అనితను పుట్టింటికి పంపించింది. ఈక్రమంలో నాగరాజు శనివారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో ఎక్కడికి వెళ్లాడో తెలియక కుటుంబ సభ్యులు వెతికారు. ఆదివారం గ్రామ శివారులోని బాల్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్ద ఓ వేప చెట్టుకు ఉరేసుకొని మృతిచెందినట్లు సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు వెళ్లారు. పుట్టింటికి వెళ్లిన తన కోడలు కాపురానికి వస్తుందో రాదో అని దిగులు చెంది ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజు తల్లి బీర్లా సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కూరెళ్లలో ఇసుక డంపు పట్టివేత


కూరెళ్ల ప్రాంతంలో నిల్వ చేసిన ఇసుక

కోహెడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరెళ్ల గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. మోయతుమ్మెద వాగు నుంచి కొందరు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ కూరెళ్లలో డంపు చేశారని పోలీసులకు ఆదివారం విశ్వసనీయ సమాచారం తెలిసింది. ఈ మేరకు అక్కడికి వెళ్లి ఇసుక డంపును పట్టుకున్నట్లు పోలీసులు వివరించారు. సుమారుగా 12 టన్నుల ఇసుక ఉంటుందని పేర్కొన్నారు. ఇసుక డంపును రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి.. ఏడుగురిపై కేసు

శివ్వంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : భూవివాదంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం మల్లుపల్లిలో చోటుచేసుకున్నది. బాధితుడు, ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లుపల్లి గ్రామంలో సర్వేనంబర్ 526 భూమిలో సరిహద్దు వివాదం తలెత్తగా గ్రామానికి చెందిన గ్యాదరి శీనుపై కొందరు దాడి చేసి చొక్కాను చింపారు. గ్యాదరి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లుపల్లికి చెందిన గ్యాదరి ప్రవీణ్, కర్రే మహేష్, గ్యాదరి నెల్లూరు, గంజి మల్లేశం, బిక్షపతి, సాయిబాబు గ్రామానికి చెందిన పిట్ల శ్రవణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


తలపై సంచితో అప్పాయిపల్లి కాలువను తాడు సాయంతో దాటుతున్న రైతు

వంతెన లేక.. కాలువ దాటడం తప్పక

దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంట పొలాలకు వెళ్లాలన్నా.. అత్యవసర పరిస్థితుల్లో అటు నుంచి ఇటు రావలన్నా ఆ గ్రామ రైతులకు కాలువ దాటక తప్పడం లేదు. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ నుంచి వచ్చే కాలువ దౌల్తాబాద్ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామం నుంచి వెళుతుంది. కాలువ అవతల గ్రామస్థులకు చెందిన సుమారు 600 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతులు ఈ పొలాలకు వెళ్లాలంటే కాలువపై బ్రిడ్జి లేక ప్రయాస పడుతున్నారు. గ్రామానికి దూరంగా ఓ బ్రిడ్జి ఉండగా, పక్కనే ఉన్న పొలాల వద్దకు అంత దూరం వెళ్లి చుట్టూ తిరగ లేక కాలువ దాటక తప్పడం లేదు. పొలాల వద్దకు ఎరువులు, యూరియా బస్తాలు తీసుకెళ్లేందుకు, అటు నుంచి ఏమైనా గ్రామానికి తీసుకొచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులకు ఈ కాలువను దాటేందుకు ఆపసోపాలు తప్పడం లేదు.


అప్పాయిపల్లి కాలువలో నుంచి ఓ రైతును ఎత్తుకొని దాటిస్తున్న మరో రైతు

ఘనంగా మట్టల ఆదివారం



మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు, హత్నూరలో మట్టలతో క్రైస్తవులు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మట్టలు సేకరించి వాటితో చర్చి ఆవరణలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు మట్టల ఆదివారం విశిష్టతను తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం కిక్కిరిసింది. ఈ సందర్భంగా భక్తులకు మతగురువులు ఆశీర్వచనాలందించారు. మట్టల పండుగలో డయాసిస్ మినిస్ట్రియల్ సెక్రెటరీ జయానంద్, తదితరులు పాల్గొన్నారు.

హత్నూర మండలంలో

హత్నూర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని కొన్యాల, చీక్‌మద్దూర్, కాసాల, దౌల్తాబాద్, ముచ్చర్ల, రెడ్డిపాలెం, హత్నూర తదితర గ్రామాలలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు నిష్టతో ఉపవాస దినాలు పాటిస్తూ ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఈత మట్టలు చేత పట్టుకుని ఆలయాల వద్దకు వచ్చి గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాసాల రెవరెండ్ బి.కాంతారావు గురువులు, కొన్యాల రెవరెండ్ అమృతరావు భక్తుల ఉద్దేశించి వాక్యోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టరేట్ కమిటీ మెంబర్లు పాముల భాస్కర్, ప్రభాకర్, సుభాష్, సాగర్, సంఘ పెద్దలు లక్ష్మణ్, పురుషోత్తం, ఆశయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోహీర్ మండలంలో

కోహీర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు బిలాల్‌పూర్, మనియార్‌పల్లి, కవేలి, గురుజువాడ, రాజనెల్లి, మద్రి, పీచేర్యాగడి, సజ్జాపూర్, బడంపేట, పర్శపల్లి, గొడిగర్‌పల్లి, పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, చింతలఘట్టు గ్రామాలలో ఆదివారం మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈత జెబ్బలకు రంగురంగుల పూలను అలంకరించి గ్రామ పురవీధుల్లో క్రీస్తు కీర్తనలు పాడుతూ, క్రీస్తు విశిష్టతను తెలుపుతూ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతరం క్రీస్తు మరణం, పునరుద్ధరణ వంటి అంశాలపైన ఆయా సంఘ కాపరులు వ్యాక్యోపదేశం చేశారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ చర్చిల పాస్టర్లు, క్రైస్తవ చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ముంపు.. సాగుకు దూరం

- వ్యవసాయ భూమి ఉన్నా పండించలేక పేద కుటుంబ దైన్యం
- అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం



పెద్దచెరువు కట్ట దిగువన భూమిలో నిల్వ ఉన్న మురుగు నీరు, నీటిని మళ్లించాలని వేడుకుంటున్న యాదగిరి

చేర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని పెద్దచెరువు ఆయకట్టుకింద విలువైన భూమి ఉందని సంతోషించే కన్నా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో మురుగు నీటి డంపుగా మారడంతో పంటలు పండించుకోలేక జీవనోపాధి కోల్పోతున్నామని ఓ పేదింటి రైతుకుటుంబం రోదిస్తుంది. కనీసం ఇంటిల్లిపాది పొట్టనింపుకోవడానికైనా ఒక్క మడి పొలం అచ్చుకడదామనుకున్నా మురుగు నీటిమయంతో తుంగలు పరుచుకుని అడియాసలవడంతో దిగాలు చెందుతున్నారు. మురుగు నీటి మళ్లింపు నిలిపివేయాలని చాన్నాళ్లుగా పలుమార్లు మున్సిపల్, జిల్లా అధికారుల కాళ్లావేళ్లా పడి ప్రాధేయపడినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చేర్యాల పట్టణానికి చెందిన బస్వరాజు యాదగిరికి పెద్దచెరువు ఆయకట్టు కింద ఎ1-14 గుంటల భూమి ఉంది. పెద్దచెరువు కట్టను ఆనుకుని ఉండటంతో మంచిగా బోర్లు పోస్తుండడంతో గతంలో పంటలు పండించుకున్నారు. కానీ చాన్నాళ్లుగా పట్టణంలోని డ్రైనేజీని ఇటువైపు మళ్లించడంతో వ్యవసాయ భూమి కాస్త మురుగునీటి డంపుగా మారింది. పెద్దచెరువు సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, కాలువలు సక్రమంగా లేకపోవడం, ప్రధాన డ్రైయిన్‌కు అనుసంధానం చేయకపోవడంతో వాలు ప్రదేశానికి చేరుకుని ఈ భూమిలో నిల్వ ఉంటున్నాయి. నానాటికీ సమీప ప్రదేశంలో భవన నిర్మాణాలు పెరిగి విస్తరించడంతో ఆయా ఇళ్ల నుంచి మురుగు కాల్వల ద్వారా వచ్చే నీరంతా బస్వరాజు యాదగిరి పొలంలోకి చేరుతున్నాయి. దీంతో యాదగిరి పొలంతో పాటు సమీపంలోని భూములు దెబ్బతింటున్నాయి. సమీపంలోనే ఉన్న ఇంటిని ఆనుకుని పొలం అంతా డ్రైనేజీ నీటిమయమడం, దుర్గంధం వెదజల్లుతూ దోమలు విజృంభిస్తుండటంతో పాటు పందు స్వైరవిహారం చేస్తుండటంతో సమీప పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులతో పాటు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసినా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ఉసూరుమంటున్నారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాగా కొన్నాళ్ల క్రితం పెద్దచెరువు మత్తడి ఆవరణ నుంచి వరద నీటి మళ్లింపు కోసం కాలువ నిర్మించి అర్ధాంతరంగా నిలిపివేయడంతో వర్షాకాలంలో వరదనీటితో పాటు డ్రైనేజీ నీరు ప్రవహించి సమీప ప్రదేశానికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. బస్వరాజు యాదగిరితో పాటు మరికొంత మంది పొలాల భూములుండటంతో వారి పరిస్థితి ఇదేమాదిరిగా నెలకొందంటూ వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు స్పందించి మురుగునీటిని రాకుండా మళ్లించాలని వేడుకుంటున్నారు.


పెద్దచెరువు సమీపంలో అసంపూర్తిగా మురికి కాలువ

కొండాపూర్‌లో అట్టహాసంగా కుస్తీ పోటీలు


కొండాపూర్‌లో కుస్తీ పోటీలో తలపడుతున్న పహిల్వాన్‌లు

నారాయణఖేడ్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆదివారం మండల పరిధిలోని కొండాపూర్ హనుమాన్ ఆలయం ఆవరణలో కుస్తీ పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ప్రతీ యేటా హనుమాన్ జయంతి ఉత్సవాల మరుసటి రోజు కుస్తీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సంవత్సరం ఎండల తీవ్రత అధికంగా ఉన్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పహిల్వాన్‌లు తలపడ్డారు. ఈ కార్యక్రమాన్ని అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ప్రారంభించారు. పహిల్వాన్‌లకు ప్రోత్సహించే విధంగా డప్పు చప్పుళ్లు, ఈలలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. రూ.10 నుంచి పహిల్వాన్ స్థాయి నుండి రూ.500 వరకు నగదు బహుమతి అందజేశారు. చివరి కుస్తీకి ఐదు తులాల వెండి కడియాన్ని బహుమతిగా అందించారు. కుస్తీ పోటీల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీటి వసతి, ప్రాథమిక చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరక్‌పల్లి దేవిదాస్ మహరాజ్, రఘు, గోపాల్, కిషన్, విఠల్‌నాయక్, రాంచందర్, దేవిసింగ్, నందు, భక్తిరాంలు పాల్గొన్నారు.


పోటీలను తిలకిస్తున్న సంగ్రాం మహరాజ్, దేవిదాస్ మహరాజ్


మల్లన్న ఆలయం.. భక్తజనసంద్రం

చేర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న దర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తజనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనం చేసి భక్తి ప్రపత్తులతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లం పానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మ దర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖ మండపం, గంగిరేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు జనాలతో సందడిగా మారింది. తమ కోరికలు నెరవేర్చమని వేడకుంటూ ఆలయ ప్రాంగణంలోని గంగిరేగు చెట్టుకు భక్తులు ముడుపులు కట్టారు. ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం కార్యనిర్వహణాధికారి ఏ.భాస్కరావు ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో అన్నపూర్ణ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం బహూకరించారు.


ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తజనం

వనదుర్గమ్మ సన్నిధి కిటకిట


ఏడుపాయల వనదుర్గమాత ఆలయంలో భక్తులు



పాపన్నపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి సహస్రనామార్చన, కుంకుమార్చన చేసి, అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


కంగ్టి సిద్ధేశ్వరాలయం జాతరకు ముస్తాబు


ఆలయంలో కొలువుదీరిన సిద్ధేశ్వరుడు

కంగ్టి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న రాష్ట్ర సరిహద్దుల్లోని కంగ్టి సిద్ధేశ్వర ఆలయం జాతర ఉత్సవాలకు ముస్తాబైంది. వారం రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే వేడుకలకు పొరుగునే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సిద్ధేశ్వరుడి ఆలయం వరకు నిర్వహించే స్వామివారి రథోత్సవం అద్భుత ఘట్టంగా చెప్పవచ్చు. 108 కట్టెలతో ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై స్వామి వారు ఆసీనులవ్వగా డప్పుచప్పుళ్లు, భక్తుల జయజయధ్వానాల మధ్య రథాన్ని లాగుతూ తీసుకెళ్లడం చూసేందుకు రెండు కళ్లు చాలవు. ఈనెల 16 నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభంకానున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ దారం వెంకట్, ఈవో రుద్రప్పలు తెలిపారు. ఈనెల 16న రథంపై ప్రత్యేకంగా వెదురు కర్రలతో తయారు చేసిన భారీ శిఖరాన్ని అధిష్టింప చేస్తారు. 17న ఆలయంలో భజనలు, అన్నదానం, కొనసాగుతాయి. 18న వేకువ జామున స్వామివారి ఊరేగింపు, రథం ముందు అగ్నిగుండం ఏర్పాటు చేస్తారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు. 19న కుస్తీ పోటీలు జరగనున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాలు ముస్తాబవ్వగా స్వామి వారి రథం పనులు చకచక సాగుతున్నాయి. 16న శిఖరోత్సవంతో జాతర ప్రారంభమౌతుండగా బుధవారం నుంచి వారం రోజుల పాటు స్థానికంగా అన్ని వర్గాల ప్రజలు తమ తమ వ్యవసాయ, యాంత్రీకరణతో సాగే పనులకు విరామం ఇస్తారు. గతంలో శిఖరోత్సవం జరుగుతున్న తరుణంలో గ్రామంలో పిండిమరను నడుపుతున్న వ్యక్తి పట్టాలు తెగి మృతి చెందడం జరిగిందని, అప్పటి నుంచి శిఖరోత్సవం జరిగాకా వారం పాటు వ్యవసాయ పనులు, యంత్రాలతో సాగే పనులను స్వచ్ఛందంగా నిలిపి వేస్తూ వస్తున్నారు.

బేతాళుడి జాతర చూసొద్దాం రండి!

- నేటి నుంచి అల్లాదుర్గంలో ఉత్సవాలు



అల్లాదుర్గంలోని శ్రీబేతాళస్వామి ఆలయం, కొలువుదీరిన స్వామివారు

అల్లాదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గామాత జాతర తర్వాత రెండో అతిపెద్ద జాతరగా పిలువబడే అల్లాదుర్గంలోని బేతాళస్వామి జాతర ఉత్సవాలకు సిద్ధమైంది. సోమవారం నుంచి ప్రారంభకానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడలేని బేతాళస్వామి ఆలయం అల్లాదుర్గంలో ఉండటంతో ఈ స్వామిని కొలిచేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వారే కాకుండా సమీపంలోని కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు విచ్చేస్తారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా నాలుగు రోజుల ముందుగా పట్టణంలోని పోలేరమ్మ, పోచమ్మ, దుర్గమ్మ, బేతాళస్వామికి బోనాలతో ఊరేగించి ఆయా ఆలయాల్లోని అమ్మవారికి, స్వామికి బోనాలను సమర్పిస్తారు. ఈ నెల 18న ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు, అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ నవాజ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.



బెజ్జంకి లక్ష్మీనృసింహ ఆలయం గుట్ట కింద వెలుగులు విరజిమ్ముతున్న తాత్కాలిక దుకాణాలు, గజవాహనంపై పురవీధుల గుండా ఊరేగుతున్న నృసింహస్వామి

నృసింహుడి క్షేత్రం.. రథోత్సవానికి సిద్ధం

బెజ్జంకి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ప్రారంభమయ్యే రథోత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. తెల్లవారు జామున గుట్టపైన ప్రధాన ఆలయంలోని ఉత్సవమూర్తులకు అర్చకులు విశేష పూజలను నిర్వహించి కిందకు తీసుకురానున్నారు. రథంపై నెలకొల్పి భక్తుల గోవిందా నామస్మరణల మధ్య ఏకశిల గుట్ట చుట్టూ తిప్పనున్నారు. రథం ఎదుట దీవిటీలు వెలగించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటారు. రథోత్సవ వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూలలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏకశిల గుట్ట ప్రాంతం భక్తజనసంద్రంగా మారింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తును నిర్వహిస్తున్నారు.

గజవాహనంపై ఊరేగిన నృసింహస్వామి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీ సమేత నృసింహస్వామి గజవాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు మంగళహారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.


గుట్ట కింద బయటకు తీసిన రథం

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం

గజ్వేల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర, సీతారామ దేవాలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మాజీ మంత్రి హరీశ్‌రావును ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆదివారం గజ్వేల్ పట్టణానికి వచ్చిన ఆయనను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఆలయ కమిటీ సభ్యులు ఎన్‌సీ శ్రీనివాస్, నర్సింగరావు, బాల్‌కుమార్, గంగిశెట్టి రవిందర్, మామిడి శ్రీధర్ తదితరులున్నారు.

నిమ్మరసం వితరణ కేంద్రం ప్రారంభం


నిమ్మరసం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు, నిమ్మరసం వితరణ కేంద్రం ఎంతో దోహదపడుతాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. బీఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొంగు రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బ్లాక్ ఆఫీస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, నిమ్మరసం వితరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

హరీశ్‌రావును కలిసిన నేతలు

సిద్దిపేట రూరల్,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామం మీదుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఆదివారం వెళ్తుండగా గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు వారిని బస్టాప్ వద్ద కలిశారు. రాష్ట్రంలోనే ఎమ్మెల్యేల్లో హరీశ్‌రావుకు మొదటి స్థానం, కేసీఆర్‌కు రెండో స్థానం రావడం బీఆర్‌ఎస్ ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వృద్ధుడు పల్లపు పాపయ్య శాలువ, స్వీట్లు తీసుకువచ్చి హరీశ్‌రావును సన్మానించే ప్రయత్నం చేయగా.. అంతా మీ సహకారంతోనే ఆ గుర్తింపు వచ్చిందని పాపయ్యను శాలువతో సన్మానించారు.

నేటి నుంచి హక్కుల సాధికారిత ప్రచారోద్యమం

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్


ఎర్రవల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శంకర్

గజ్వేల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంతోత్సవాల సందర్భంగా నేటి నుంచి దళిత బహుజన హక్కుల సాధికారిత ప్రచారోద్యమాన్ని చేపడుతున్నట్లు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ప్రకటించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఎర్రవల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశంలో మెజారిటీ సంఖ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలపై వివక్ష, హక్కుల అమలులో నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు. అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. ప్రభుత్వ పథకాలను మెజారిటీగా ముంపు గ్రామాలకు వర్తింపజేసినప్పుడే నిజమైన సాధికారత సాధించిన వారమవుతామన్నారు. ఆయన వెంట డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, మాసాన్‌పల్లి మైసయ్య, ముంపు గ్రామాల ప్రజలు ఉన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే యూటీఎఫ్ లక్ష్యం

● టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్


గజ్వేల్‌లో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్/చేర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమమే యూటీఎఫ్ లక్ష్యమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్ మండలాధ్యక్షుడు టి. శ్రీనివాస్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆయన రాష్ట్ర నాయకులు వి. సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటకిరణ్, ప్రభావతితో కలసి మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో, హక్కులు బాధ్యతలను ఉద్యమ నేత్రాలుగా, చారిత్రక ఆవశ్యకతతో యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. వారివెంట యూటీఎఫ్ నాయకులు నిర్మల, రవిందర్, సుదాకర్, వెంకటేశం, మహబూబ్‌పాషా, ప్రశాంత్, కృష్ణ, మహేశ్వరీ, శ్రీనివాస్, వెంకట స్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చేర్యాల పట్టణంలోని అంగడిబజారు చౌరస్తా వద్ద యూనియన్ మండల ఉపాధ్యక్షురాలు ఉమారాణి జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.


పందిల్ల వాగుపై అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణ పనులు

నత్త నడకన బ్రిడ్జి పనులు

● గుంతలమయంగా తాత్కాలిక రోడ్డు
● అవస్థలు పడుతున్న వాహనదారులు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నుంచి పందిల్ల వెళ్లే దారిలోని వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్లకొద్ది పనులు కొనసాగుతుండడంతో వాహనదారుకు తిప్పలు తప్పడం లేదు. వాగులో తాత్కాలికంగా వేసిన రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక దుమ్ముధూళి కళ్లలోకి చేరి నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించి బ్రిడ్జి పనులను వేగవంతంగా వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, గుంతలు పడిన తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనుల జాప్యంతో ఇబ్బంది



ఎల్కతుర్తి టూ సిద్దిపేట వరకు జరుగుతున్న నేషనల్ హైవే, పందిల్ల బ్రిడ్జి పనుల్లో జాప్యం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా వేసిన రోడ్డు గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పనుల్లో వేగం పెంచాలి.

- ఐలేని మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి

ఆదర్శనీయుడు అంబేడ్కర్

● ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు ర్యాలీగా వస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య తదితరులు

దౌల్తాబాద్,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేటి యువతకు ఆదర్శనీయుడని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముబ్బారస్‌పూర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంటకటయ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముబ్బారస్‌పూర్ గ్రామం నుంచి ఎస్సీ కమ్యూనిటీ సంఘం సభ్యులతో కలిసి ర్యాలీగా తరలివచ్చి అంబేడ్కర్ విగ్రహానికి ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అణచివేత, చిన్న చూపునకు గురైన అంబేడ్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదివి అన్ని వర్గాల మన్ననలు పొందారన్నారు. ఏ వర్గమైన అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈదుగారి యాదగిరి, మాజీ ఎంపీటీసీ స్వామి, మల్లేశంపల్లి మాజీ సర్పంచ్ దార సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాషా, ఖలీలొద్దీన్, లక్ష్మణ్, రమేష్, స్వామి, నాగరాజు, దయాకర్, స్వామి, ఎస్సీ కమ్యూనిటీ సంఘం సభ్యుల పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతుధరను పొందాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండలం చెప్యాల, మిరుదొడ్డి, కాసులబాద్, గ్రామాల్లోని పీఏసీఎస్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, సత్యనారాయణ, లింగం, బాల్‌రాజు, జడిపల్లి రవి తదితరులున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దౌల్తాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని దొమ్మాట జడ్పీ పాఠశాలలో చదివిన 1999-2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక చోట చేరి ఆప్యాయంగా పలకరించుకొని పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అయాంగారి ప్రవీణ్, నర్సింహులు, కరుణాకర్, సంతోష్, దశరథం, మల్లేశంగౌడ్, రాజేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో నిరుపేదల కళ్లలో ఆనందం

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి


మినీ ట్యాంకును ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యంతో నిరుపేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారె డ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు సంగుపల్లిలో మినీ ట్యాంకును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్నబియ్యం పథకంతో నిరుపేదల కడుపు నిండుతుందని, గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సన్నబియ్యాన్ని అందిస్తున్న ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మునిసిపాలిటీలో తాగునీటి సమస్య లేకుండా చూడడమే లక్ష్యమని, వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి గోసలు తీర్చడం కోసం సంగుపల్లి వాసి నక్క రాములు కృషి అభినందనీయమన్నారు. కాగా గజ్వేల్ మండల పరిధిలోని కోమటిబండ, ధర్మారెడ్డిపల్లి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్, నాయకులు మోహన్నగారి రాజు, రేగొండ, గుంటుకు శ్రీనివాస్, సమీర్, జగ్గయ్యగారి శేఖర్, జంగం రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'బత్తుల చంద్రంపై దాడి చేసినవారిని అరెస్ట్ చేయాలి'

గజ్వేల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బత్తుల చంద్రంపై దాడి చేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసి, అరెస్టు చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో నివాసముంటున్న బత్తుల చంద్రంపై పలువురు దాడి చేయడాన్ని ఖండించారు. ఈ విషయమై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి
● ముగిసిన జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం


అక్కన్నపేటలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

అక్కన్నపేట/సిద్దిపేట రూరల్/చేర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో అంతకపేట, అక్కన్నపేట గ్రామాల్లో చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్‌ను ప్రపంచం మొత్తం కీర్తిస్తున్నప్పటికీ బీజేపీ మాత్రం ఆయనను గుర్తించడానికి వెనుకడుగు వేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింతల మల్లారెడి తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, బచ్చాయిపల్లి, బుస్సాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో చేపట్టిన పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జీ పూజల హరికృష్ణ పాల్గొని మాట్లాడారు. మతోన్మాద రాజకీయాలను పెంచిపోషిస్తున్న బీజేపీ ప్రజలంతా ఐక్యతతో తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గరిపల్లిత రాములు, పుల్లూరు ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్య గౌడ్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.


సిద్దిపేట రూరల్ : రాఘవాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పూజల హరికృష్ణ

● చేర్యాల మండలం కొత్తదొమ్మాట, కమలాయపల్లి గ్రామాలలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండల అధ్యక్షుడు కొమ్ము రవి, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం రానివ్వం


బండమైలారంలో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ములుగు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడతున్నామని ములుగు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ములుగు మండలం బండమైలారం పారిశ్రామిక వాడలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టారు. కంపెనీలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి విద్యుత్ అందిస్తామని తెలిపారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయండి

● కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న ఏర్పాటు చేసిన జిల్లా సదస్సును జయప్రదం చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు గోపాలస్వామి, మంచే నర్సింహులు, కిష్టాపురం లక్ష్మణ్ కోరారు. కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయడానికి ముందస్తుగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 29 రకాల కార్మిక చట్టాలను కార్మిక ప్రయోజనాల కోసం అమలు చేస్తే వాటిని పూర్తిగా రద్దుచేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడలను తెచ్చిపెట్టి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమావేశంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్, నాయకులు శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

మద్దూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పేదల కోసం ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో డాకూరి పురుషోత్తంరెడ్డి, డాకూరి భగవాన్‌రెడ్డిల మాతృమూర్తి డాకూరి లక్ష్మి జ్ఞాపకార్థం సురక్ష ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. 987 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి


బండరాళ్లను కట్ చేస్తున్న వ్యక్తి

తపాస్‌పల్లిలో అక్రమ మైనింగ్!

చేర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామశివారులోని ప్రభుత్వ భూమిలో పలువురు అక్రమమైనింగ్‌కు పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తపాస్‌పల్లి గ్రామంలోని సర్వే నెం.93లో సుమారు100 ఎకరాల ప్రభుత్వ భూమిలో బండరాళ్లు ఉన్నాయి. వీటిని బ్లాస్టింగ్స్ చేయడంతో పాటు అక్రమ విద్యుత్ వినియోగంతో కటింగ్ చేస్తూ ట్రిప్పుల కొద్ది రాయిని తరలించి విక్రయిస్తూ అక్రమ వ్యాపారానికి ఒడిగడుతున్నారు. గతంలో ఎలాంటి అనుమతులు లేకుండా బండరాళ్లను కటింగ్ చేసిన విషయమై స్థానికులు ఆందోళన చేపట్టడం వివాదాస్పదంగా మారగా అధికారులు విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. మళ్లీ కొద్దిరోజులుగా అక్రమార్కులు వ్యవసాయ విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తూ బండరాళ్లను కటింగ్ చేస్తున్నారు. దీన్ని గమనించిన స్థానికులు ఆదివారం రెవిన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించి అక్రమమైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

● ముగిసిన బొడ్రాయి ఉత్సవాలు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బొడ్రాయి వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. దుర్గమ్మకు, బూడిదారు మైసమ్మకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలోని మహిళలు రంగులతో అలంకరించిన బోనాలను నెత్తిపై ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో గ్రామం నుంచి దుర్గమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, కొండపోచమ్మ మాజీ చెర్మన్ శ్రీనివాస్‌రె డ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బోయిన పుల్లయ్య, కొన్నె జయమ్మ తదితరులు ఉన్నారు.


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

ఉస్మానియా అరుణతార కామ్రేడ్ జార్జిరెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా అరుణతార కామ్రేడ్ జార్జిరెడ్డి అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బాలుర వసతి గృహంలో జార్జిరెడ్డి వర్థంతి వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 1970లో ఓయూలో కొనసాగిన ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా జార్జిరెడ్డి పోరాడారన్నారు. ఆయనవెంట పీడీఎస్‌యూ నాయకులు కోట మహేందర్, గ్యార గణేశ్ తదితరులున్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

మిరుదొడ్డి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్ అన్నారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి, కూడవెళ్లి, అక్బర్‌పేట గ్రామాల్లో సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అక్బర్‌పేటలో సన్నబియ్యం లబ్ధిదారు లక్ష్మి ఇంట్లో భోజనం చేశారు. అనంతరం మహిళకు పట్టుచీరను అందించారు. కార్యక్రమంలో అక్బర్‌పేట-భూంపల్లి మండల కోఆర్డినేటర్ నరేందర్, నాయకులు గుండాశంకర్, శ్రీనివాస్‌గౌడ్, బాలాగౌడ్, వెంకటేశం, శ్రీధర్ తదితరులున్నారు.